క్లుప్తంగా

కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణం


కపిలేశ్వరపురం జగనన్న కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తున్న శ్రామికులు

కపిలేశ్వరపురం: స్థానిక జగనన్న కాలనీలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో నిధులు మంజూరయ్యాయి. కాలనీలో ఇప్పటికే లబ్దిదారులు ఇళ్లను నిర్మించుకున్నారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి తెలిపారు.

ద్వారపూడి అయ్యప్ప సన్నిధికి స్వాముల పాదయాత్ర


పాదయాత్రగా వెళుతున్న అయ్యప్ప స్వాములు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాలయం నుంచి ఆంధ్రా శబరిమల ద్వారపూడి అయ్యప్ప సన్నిధికి గురుస్వామి కైరం వీరవెంకటసత్యనారాయణ(సత్తార్ స్వామి) ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వాములు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. వారికి ద్రాక్షారామ బ్రహ్మకుమారీలు, రామచంద్రపురం రాజగోపాల్ సెంటర్‌లో ఉన్న సీతారామ భక్త వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆంజనేయ స్వామి సేవా సమితి సభ్యులు సాదరంగా పంపించారు.

మైనారిటీలు వైఎస్సార్ సీపీ పక్షం

మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రబ్బానీ



కపిలేశ్వరపురం (మండపేట): ముస్లిం మైనారిటీలంతా వైఎస్సార్ సీపీ పక్షమేనని, విపక్షాలు చేస్తున్న ఓటు బ్యాంకు రాజకీయాలను మైనారిటీలంతా తిప్పికొడతారని మండపేట మున్సిపల్ కో- ఆప్షన్ సభ్యుడు, మైనారిటీ నాయకులు సయ్యద్ రబ్బానీ ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపైనా, పార్టీ కో- ఆర్డినేటర్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పైనా విపక్షాల నాయకులు చవకబారు ఆరోపణలు చేయడాన్ని రబ్బానీ తప్పుబట్టారు. దీర్ఘకాలంగా టీడీపీ, ఇతర పార్టీలు మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీల అభ్యున్నతికి బాసటగా నిలిచారన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మైనారిటీల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయన్నారు. నామినేటెడ్ పదవుల్లో గత ప్రభుత్వాలెప్పుడూ ఇవ్వని స్థాయిలో సీఎం జగన్ మైనారిటీలకు అవకాశాలనిచ్చారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మైనారిటీల పక్షపాతిగా వెన్నంటి నిలుస్తున్నారన్నారు. భూస్వామ్య లక్షణాలను పునికిపుచ్చుకున్న నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు పేద, మధ్య తరగతి ప్రజలకు బాసటగా నిలుస్తున్న ఎమ్మెల్సీ తోటపై చవకబారు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు.

ముగిసిన సప్తాహ మహోత్సవాలు

కాజులూరు: ఆర్యావటంలో గత వారం రోజులుగా జరుగుతున్న సప్తాహ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. స్థానిక భక్త కమిటీ సభ్యులు ఈ నెల 19వ తేదీన స్థానిక రామాలయంలో కలశ స్థాపనతో ప్రారంభించారు. అప్పటి నుంచి నిర్విరామంగా భజన కార్యక్రమాలు కొనసాగించడంతోపాటు ప్రతి రోజు జ్యోతిర్లింగార్చన, కుంకమ పూజలు చేశారు. ఆదివారం కమిటీ సభ్యులు పూర్ణాహుతి నిర్వహించి పూజా కార్యక్రమాలు ముగించారు. సోమవారం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

అర్తమూరు చేరిన తిరుమల రథయాత్ర


అర్తమూరు రథయాత్రలో ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): తిరుమల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభమైన వేంకటేశ్వర వైభవ రథయాత్ర ఆదివారం మండపేట మండలం అర్తమూరుకు చేరుకుంది. తిరుమలలో ప్రారంభమై వంద రోజుల పాటు క్షేత్ర పర్యటన చేసి తిరిగి యాత్ర తిరుమల చేరుకుంటుంది. దేశం నలుమూలల్లోని 500 వేంకటేశ్వరస్వామి ఆలయాలను అనుసంధానిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేయడమే లక్ష్యంగా యాత్ర ముందుకు సాగుతుంది. అర్తమూరులో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద యాత్రకు భక్తులు ఘన స్వాగతం పలికారు. శ్రీవారి భక్త మండలి చైర్మన్ ఎస్.బుల్లిస్వామిరెడ్డి, ఎస్.లక్ష్మణ్‌రెడ్డి, పి.సుబ్బారెడ్డి, కె.పాపారాయుడు, ఆలయ అర్చకులు పి.సుబ్బారావు పాల్గొన్నారు.

అందరూ రండి..ఆడుదాం ఆంధ్ర

- సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా సంబరాలు
- విజేతలకు రూ.5 లక్షల వరకూ నగదు బహుమతులు
- డిసెంబరు 15 నుంచి పోటీలు ప్రారంభం

రాయవరం: ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకు రావడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా (ఇది అందరి ఆట) పేరుతో క్రీడా సంబరాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. డిసెంబరు 15 నుంచి 2024 జనవరి 26 వరకూ నిర్వహించే దిశగా మెగా టోర్నీకి సర్వం సిద్ధం చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం, రాయవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, కాజులూరు మండలాల పరిధిలో సోమవారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటుగా క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. గ్రామీణ స్థాయి నుంచి యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఇప్పుడు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ఆటల పోటీలను నిర్వహించనున్నారు. క్లస్టర్ లోని వివిధ సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించనున్నారు.

సంప్రదాయ క్రీడలకూ ప్రాధాన్యం

ఈ క్రీడా సంబరాల్లో ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలతో పాటు గ్రామీణ ప్రాంత సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించుకునే అవకాశం కూడా కల్పించారు. ప్రతి సచివాలయం పరిధిలో వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో ఒక్కో క్రీడకు రెండు పురుషుల, రెండు మహిళల జట్లు పాల్గొనేలా చూడాలి. ఒక సచివాలయ పరిధిలో క్రీడల నిర్వహణకు కనీసం 228 క్రీడాకారులు ఉండాలి. ఈ ప్రకారం ఐదు క్రీడలకు ప్రతి సచివాలయం పరిధిలో 20 జట్లు పాల్గొంటాయి. ఐదు రోజుల్లో క్రీడల ప్రక్రియ పూర్తి చేసి, మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గ స్థాయిలో ఐదు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. అనంతరం ఏడు రోజుల పాటు జిల్లా స్థాయి, మరో ఐదు రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తారు.

గ్రామ/వార్డు స్థాయి నుంచి

పోటీలను ముందుగా గ్రామ, పట్టణాల్లోని వార్డు స్థాయి నుంచి నిర్వహిస్తారు. తర్వాత మండల/పట్టణ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విజేతలకు క్రీడా పరికరాలు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు. ప్రతి టీమ్‌కు వాలీబాల్ జట్టులో 12, కబడ్డీ 12, ఖోఖో 15, క్రికెట్16, బాడ్మింటన్ జట్టులో ఇరువురు వంతున క్రీడాకారులు ఉంటారు. ఇవి కాకుండా క్రీడాకారులు ఆసక్తి చూపిస్తే యోగా, టెన్నికాయిట్, 3-కే మారథాన్, గ్రామీణ సంప్రదాయ క్రీడలను కూడా నిర్వహిస్తారు.

నేటి నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

15 ఏళ్లు పైబడిన బాలబాలికలు, మహిళలు, పురుషుల నుంచి సీనియర్ సిటిజన్లు సైతం ఈ క్రీడా పోటీల్లో పాల్గొన వచ్చు. సోమవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను గ్రామస్థాయిలో వలంటీర్లు చేపడతారు. గ్రామ/వార్డు సచివాలయాలకు క్రీడా సామగ్రి చేరుకుంది. సచివాలయ స్థాయిలో బేసిక్, నియోజకవర్గ స్థాయిలో ప్రొఫెషనల్ క్రీడా సామగ్రి అందిస్తారు. మండల స్థాయికి ఎంపికైన వారికి టీషర్ట్, క్యాప్, రిస్ట్ బ్యాండ్, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ అందజేస్తారు.


ఖోఖో ఆడుతున్న కీడాకారులు (ఫైల్)



వివిధ స్థాయిల్లో కమిటీలు

గ్రామ/సచివాలయ స్థాయిలో పోటీల నిర్వహణకు గ్రేడ్-5 సెక్రటరీ, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, పాఠశాల హెచ్‌ఎం ఉంటారు. మండల స్థాయిలో ఎంపీడీవో, పంచాయతీ విస్తరణాధికారి, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతిపథం, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ శాఖ, ఏవో, ఏఈ, ఇంజనీరింగ్ సభ్యులుగా ఉంటారు. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో వివిధ అధికారులతో నియోజకవర్గ, జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌లో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రైజ్‌మనీ అందజేస్తారు.

క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం



ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. గ్రామీణ స్థాయి నుంచి అన్ని వయసుల వారికి నిర్వహిస్తున్న పోటీల ద్వారా ప్రజల్లో క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది. ఈ పోటీల ద్వారా గ్రామాల్లో పండగ వాతావరణం ఏర్పడుతుంది.

– బొంతు వంశీధర్, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడాకారుడు, రాయవరం

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం



సచివాలయ స్థాయిలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తాం. వలంటీర్ల సెల్‌లో ఆడుదాం ఆంధ్ర యాప్‌లో వివరాలను నమోదు చేస్తారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు వలంటీర్లుకు అవగాహన కల్పించాం. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం.

– కె.నరేంద్రరెడ్డి, ఎంపీడీవో, రాయవరం

ప్రాథమిక హక్కులే ప్రజాస్వామ్యానికి పునాదులు


పామర్రులో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి చెల్లుబోయిన వేణు తదితరులు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- అంబేడ్కర్ కాంస్య విగ్రహం ప్రారంభం

కె.గంగవరం: భారత దేశ ప్రజాస్వామ్యానికి ప్రాథమిక హక్కు పునాదులని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని పామర్రు ఉన్నత పాఠశాలలో ఆదివారం పాఠశాల పూర్వ విద్యార్థి కాకినాడకు చెందిన సత్య స్కాన్, డయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత డాక్టర్ కాదా వెంకట రమణ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని మంత్రి వేణు, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కోరుకొండ బాబ్జి ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం సాధన చేస్తే అవకాశాలు వాటంతట అవే మన దరి చేరుతాయన్నారు. దిగువ స్థాయి నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తుల్లో డాక్టర్ కాదా వెంకట రమణ, కోరుకొండ బాబ్జి అందుకు సజీవ సాక్ష్యమన్నారు. గౌతమ బుద్ధుని పంచశీల సూత్రాలు ప్రతిబింబించేలా అంబేడ్కర్ భారత రాజ్యాంగ రచన చేశారన్నారు. నేటి యువత అంబేడ్కర్ ఆశయ సాధన సాధించే దిశగా ప్రయాణం చేయాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్లా వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, కోటిపల్లి గ్రామాభివృద్ధి చైర్మన్ పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను), హెచ్‌ఎం పితాని శ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ భావన పెంపొందించేది ఎన్‌సీసీ


ఎన్‌సీసీ డే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఎన్‌సీసీ అధికారులు

రామచంద్రపురం: ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందుతుందని కల్నల్ శ్రీనివాస్ అన్నారు. వీఎస్ఎం అటానమస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆర్మీ, నావల్ సంయుక్తంగా నిర్వహించిన ఎన్‌సీసీ దినోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉత్తమ శిక్షణనిస్తూ విద్యార్థులకు విలువైన విద్యను అందిస్తున్నందుకు కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తిని ఆయన అభినందించారు. దేశ సైనిక వ్యవస్థలో ఆర్మీ, నేవీ పాత్ర ఎంతో గణనీయమైందన్నారు. నేటి కాలంలో ఆర్మీ, నేవీ ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎన్ అలి అన్సారీ అన్నారు. అనంతరం ఆల్ ఇండియా నేవీ క్యాంపులో పాల్గొని ప్రతిభ కనబరిచిన లలిత మణి, ఆర్మీ విద్యార్థి హైదర్ అబ్బాస్‌లను వారు అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అన్సారీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బాలాజీ, ఎక్స్ ఆర్మీ జి.సత్యనారాయణ మూర్తి, నావెల్ అధికారి పి.శ్రీహర్ష, ఎన్‌సీసీ ఆర్మీ అధికారి ఎం.అనిల్ కుమార్ ఎన్‌సీసీ డే ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు వేదిక మీద చేసిన విన్యాసాలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ముగిసిన అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలు

- బాలుర విభాగంలో కృష్ణా
- బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్ల విజయం


హోరాహోరీగా సాగుతున్న బాలికల ఫైనల్ పోరు


రసవత్తరంగా సాగిన బాలుర ఫైనల్ మ్యాచ్

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. బాలుర విభాగంలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. కృష్ణా జిల్లా విన్నర్‌గా, పశ్చిమగోదావరి జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. బాలికల విభాగంలో గుంటూరు, కృష్ణా జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. గుంటూరు జట్టు విన్నర్స్‌గా, కృష్ణా జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. తృతీయ స్థానం కోసం బాలుర విభాగంలో తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాల జట్లు పోటీపడగా తూర్పుగోదావరి జిల్లా జట్టు విజయం సాధించింది. ఇక బాలికల విభాగంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు తలపడగా పశ్చిమ గోదావరి జట్టు విజయం సాధించి, తృతీయ స్థానంలో నిలిచింది. పోటీల అనంతరం విజేత జట్లకు పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత ఆధ్వర్యంలో పారిశ్రామిక వేత్త, విద్యాదాత చింతా పాండురంగారెడ్డి, ప్రముఖ వైద్యుడు జీఎస్ఎన్‌రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. బాలుర ఫైనల్ మ్యాచ్‌కు భీమేష్, త్రినాథవర్మ, శ్రీనివాసరావులు, బాలికల ఫైనల్ మ్యాచ్‌కు సునీతాకుమారి, భీమేష్, అజీమ్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అండర్-17 విభాగంలో విజేతలుగా నిలిచిన బాలుర, బాలికల జట్లు జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తాయి. అండర్-17 బాలుర జట్టు మహారాష్ట్రలో, బాలికల జట్టు రాజస్థాన్ రాష్ట్రంలో త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి. ఈ పోటీలకు రాష్ట్ర పరిశీలకుడిగా కృష్ణారెడ్డి వ్యవహరించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కన్వీనర్ రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లమిల్లి అప్పారెడ్డి పోటీలను పర్యవేక్షించారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత మంతెన అచ్యుతరామరాజు, ఎంఈవో వై.సూర్యనారాయణ పాల్గొన్నారు.

పసలపూడిలో ఘనంగా గంధోత్సవం

రాయవరం: మండలంలోని పసలపూడిలో నాగూర్ బాబా దర్గాలో ఆదివారం ఘనంగా గంధోత్సవాన్ని నిర్వహించారు. ఏటా నిర్వహించే గంధోత్సవాల్లో భాగంగా కరీముల్లా బాబా గంధోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. గంధోత్సవంలో భాగంగా గంధపు బిందెతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు గంధపు బిందెతో దర్గా వద్దకు చేరకున్న అనంతరం హజరత్ మహమ్మద్ గులాం మొహిద్దీన్‌కు ప్రత్యేక నమాజులు జరిపించారు. ఈ సందర్భంగా ఖవాలీ గానాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.


పసలపూడి దర్గా వద్ద గంధోత్సవంలో భక్తులు

దేదీప్యమానంగా దీపోత్సవం


భీమేశ్వరాలయ ప్రాంగణంలో రాత్రి దీపాలు వెలిగించి స్వామిని పూజిస్తున్న భక్తులు

శివనామ స్మరణతో మార్మోగిన భీమేశ్వరాలయం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయం శివనామ స్మరణతో మార్మోగింది. భక్తులు ఆదివారం ఆలయానికి పోటెత్తారు. నూతన దంపతులు కార్తీక పౌర్ణమినాడు తెల్లవారుజాము నుంచే ఉపవాసాలు ఉండి శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మహిళలు సత్సంతానాన్ని కాంక్షిస్తూ కంద, పసుపు మొక్కల కొమ్మలు, గుమ్మడి కాయలు, ప్రత్యేక పూజా సామాగ్రితో ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించుకుని వేదపండితులు, అర్చకులకు సమర్పించారు. శంకరనారాయణ వృక్షం వద్ద దీపాలు వెలిగించారు. మహిళా భక్తులు సప్తగోదావరిలో కార్తీక దీపాలను వదిలిపెట్టారు. రాత్రి దేవాలయ ప్రాంగణలో కార్తిక దీపారాధాన చేశారు.

ఆదర్శనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- రాష్ట్ర మంత్రి వేణుగోపాలకృష్ణ
- ఘనంగా రాజ్యాంగం దినోత్సవం

రామచంద్రపురం: జీవన ప్రామాణిక గ్రంథాన్ని రచించి ఆయా వర్గాలకు ఆదర్శవంతుడిగా నిలిచిన మహనీయుడు డాక్టర్ భీమ్‌రావు అంబేడ్కర్ అని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. భారత రాజ్యాంగం దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం రామచంద్రపురంలో మంత్రి క్యాంపు కార్యాలయం లోనూ, ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ సేవాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందు, ఎంపీపీ అంబటి భవానీ, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైఎస్ఆర్ సీపీ నేతలు పెట్టా శ్రీనివాసరావు, రవ్వా భూషణం, కోటి దుర్గారావు, దొమ్మలపాటి సత్యనారాయణ, కంచుమర్తి బాబూరావు, పోతంశెట్టి గోపాలకృష్ణ స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు


గొల్లపాలెంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ ప్రసన్నమౌని

కాజులూరు మండలంలో..

కాజులూరు: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం భారతరాజ్యాంగ ఆవిష్కరణ దినోత్సవాన్ని స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. కాజులూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మాత భారతీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గొల్లపల్లి, ఆర్యావటం తదితర గ్రామాల్లో జరిగాయి.

దేశానికి మార్గదర్శకం రాజ్యాంగం : ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): దేశ దశ, దిశలకు మార్గదర్శకంగా భారత రాజ్యాంగం నిలిచిందని, ఆ గొప్పతనం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆదివారం నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజుబాబు, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ కొవ్వాడ బేబి, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ మండలాల కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ అన్నారు. కార్యక్రమంలో నాయకులు గారపాటి అశోక్ కుమార్, పలివెల సుధాకర్ పాల్గొన్నారు.


పడమర ఖండ్రికలో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న కపిలేశ్వరపురం మండల ప్రజాప్రతినిధులు


రామచంద్రపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి వేణు తదితరులు

కపిలేశ్వరపురం మండలంలో...

మండలంలోని 19 గ్రామాల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలో గ్రామ సచివాలయాల్లో భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడుతామంటూ ఉద్యోగులు, ప్రజాప్రతినిదులు ప్రతిజ్ఞ చేశారు. నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. భారతీయుల ఆశయ సాధన రాజ్యాంగం పటిష్ఠ అమలుతోనే సాధ్యమన్నారు. ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో రాజ్యాంగ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

రాయవరం: మండలంలోని పలు గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పల్లేటి వెంకటరత్నం, మండల ఇంజనీరింగ్ అధికారి వి.రామనారాయణ, మండల పరిషత్ కార్యాలయ ఏవో డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని అంబేద్కర్ రచించారన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించుకుంటూ రాజ్యాంగానికి లోబడి ప్రతీ పౌరుడూ ఉండాలన్నారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


మండపేట పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు